పిల్లల పండగకు వేళాయె..

- అక్టోబర్ 25, 26 తేదీల్లో గోదావరి బాలోత్సవం
- నిర్వహణకు ఏర్పాట్లు
- సుమారు 70 విభాగాల్లో పోటీలు



గోదావరి బాలోత్సవంలో నృత్యం చేస్తున్న చిన్నారులు (ఫైల్)



ఆకట్టుకున్న పిల్లల వేషధారణ (ఫైల్)

ప్రకాశం నగర్: గోదావరి బాలోత్సవం మూడో పిల్లల పండగను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. సాంస్కృతిక రాజధానిగా పేరు గాంచిన రాజమహేంద్రవరంలో గత ఏడాది ఫిబ్రవరిలో గోదావరి బాలోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అదే ఉత్సాహంతో అక్టోబర్ 25, 26 తేదీల్లో మరోసారి రాజమహేంద్రవరంలో పిల్లల పండగను జరపనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు వీఎస్ఎస్ కృష్ణ కుమార్, పి.తులసి తదితరులు ఇటీవల ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గోదావరి బాలోత్సవం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆ కార్యక్రమ వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో జరగాల్సిన ఈ కార్యక్రమం ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వాయిదా పడింది. అప్పుడే అన్ని పాఠశాలలకు రిజిస్ట్రేషన్ ఫారాలతో కూడిన బ్రోచర్లు అందజేశారు. వాటిని ఇప్పుడు చిన్నారుల పేర్ల రిజిస్ట్రేషన్ కోసం ఉపయోగించుకోవచ్చు. బ్రోచర్‌లో పాత తేదీలను మార్పు చేసి డిజిటల్ బ్రోచర్‌ని అన్ని పాఠశాలలకు వాట్సాప్ ద్వారా అందించనున్నారు.

మూడు విభాగాల్లో పోటీలు

బాలోత్సవం పోటీలను గత రెండేళ్లు ఉత్సాహంగా నిర్వహించారు. ఈసారి పెద్ద ఎత్తున చిన్నారులు హాజరయ్యే క్రమంలో దానికి తగిన విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. కల్చరల్, అకడమిక్ విభాగాలతో పాటు సైన్స్, గణితం, డిబెట్, వాయిద్యా పరికరాలు, బుర్రకథ వంటి అంశాలను ఈ ఏడాది పోటీల్లో చేర్చారు. రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో 24 అకడమిక్, 13 కల్చరల్ అంశాలతో దాదాపు 70 పోటీలు జరగనున్నాయి.

పది వేల మంది హాజరయ్యే అవకాశం

గతేడాది రాజమహేంద్రవరం చుట్టూ పక్కల మండలాలకే ఈ పోటీలు పరిమితమయ్యాయి. ఈసారి వీటిని జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొనేలా చర్యలు తీసుకున్నారు. సుమారు పది వేల మంది విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం ఉంది.

ప్రతి విభాగంలో ఐదుగురు విజేతలు



బాలోత్సవంలో దాదాపు 70 రకాల పోటీలు జరగనున్నాయి. ప్రతి పోటీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు కన్సోలేషన్ బహుమతులు కూడా అందజేయనున్నాం. పోటీల్లో పాల్గొనే ప్రతి విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తాం. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు భోజన వసతి కల్పిస్తాం.

– పి.తులసి, ఆర్గనైజింగ్ సెక్రటరీ

బీఎల్ఓల గౌరవ వేతనం ఇప్పించండి



కలెక్టర్ కీర్తి చేకూరిని కలిసిన సభ్యులు

సీటీఆర్ఐ: గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న సచివాలయ ఉద్యోగులకు ఎన్నికల విధులకు సంబంధించిన బూత్ లెవెల్ ఆఫీసర్స్ (బీఎల్ఓ) గౌరవ వేతనాలు ఇప్పించాలని ఏపీఎన్‌జీజీఓ ఆధ్వర్యంలో కలెక్టర్ కీర్తి చేకూరిని శుక్రవారం రాజమండ్రి యూనిట్ కార్యవర్గ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో బూత్ లెవెల్ అధికారులుగా విధులు నిర్వహించడమే కాకుండా ప్రజలకు ఓటు హక్కుపై అనేక సార్లు అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించడం జరిగిందన్నారు. 2024 సాధారణ ఎన్నికల్లో రెండు రోజులు పని దినాలకు సంబంధించిన ఎటువంటి వేతనం ఇవ్వలేదన్నారు. బూత్ లెవెల్ అధికారులకు న్యాయంగా రావాల్సిన వేతనాలను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

ఆదిరెడ్డి శ్రీనివాసరావుపై ఫిర్యాదు

కంబాలచెరువు: మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు తమ్ముడు ఆదిరెడ్డి శ్రీనివాసరావుపై ప్రకాశం నగర్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు నమోదైంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆదిరెడ్డి శ్రీనివాసరావు వేరే వ్యక్తితో బెట్టింగ్ విషయాలు మాట్లాడుతున్న ఒక ఆడియో వచ్చింది. దానిలో అంశాలు మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసులకు సంబంధించి, వారి గౌరవ మర్యాదలకు భంగం కలిగించేలా ఉన్నాయి. దీంతో ఆదిరెడ్డి అప్పారావు తరఫున పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తనకు, తన తమ్ముడు ఆదిరెడ్డి శ్రీనివాసరావుతో కొన్నేళ్లుగా ఎటువంటి సంబంధాలు లేవని, బెట్టింగ్ విషయాలకు సంబంధించి అతడి మాట్లాడిన ఆడియోపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అప్పారావు ఫిర్యాదులో పేర్కొన్నారు.

తొర్రేడు సొసైటీ సందర్శన

రాజమహేంద్రవరం రూరల్: రామదాసు సహకార కేంద్రంలో శిక్షణ పొందుతున్న డీసీఎం – సీఏ 10వ బ్యాచ్ ట్రైనీలు శుక్రవారం తొర్రేడులోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాన్ని (సొసైటీ) సందర్శించారు. సొసైటీ ద్వారా జరిగే వ్యాపార లావాదేవీలు, పరపతి, పరపతేతర వ్యాపారాలు, బంగారు రుణాలు తదితర వాటిని సంఘ సీఈవో కేవీవీ సత్యనారాయణ వివరించారు. కోర్సు కో ఆర్డినేటర్ ఆదిమూలం వెంకటేశ్వరరావు సహకార చట్టం, నిబంధనలు, బైలా తదితర పలు అంశాలపై అవగాహన కల్పించారు. సామర్లకోట మండలం జి.మేడపాడు సొసైటీ చైర్ పర్సన్ పాలకుర్తి రవి మాట్లాడుతూ సొసైటీ మెరుగైన సేవలందిస్తోందని, పాలకవర్గం, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో సంఘ చైర్ పర్సన్ దండమూడి బాపినీడు, పర్సన్ నల్లూరి రామకృష్ణ, శిక్షణ కేంద్రం కంప్యూటర్ ఫ్యాకల్టీ కె.అయ్యప్ప శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన



వెంకాయమ్మపేటలో మొక్క నాటుతున్న సర్పంచ్ పద్మావతి తదితరులు

కడియం: పారిశుధ్యం – పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కడియపులంక సర్పంచ్ ఎం.పద్మావతి కోరారు. స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ పక్వాడా కార్యక్రమంలో భాగంగా పంచాయతీ పరిధిలోని వెంకాయమ్మపేట ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వ్యాసరచన, కవితలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

'లేపాక్షి'లో నేటి నుంచి డిస్కౌంట్ విక్రయాలు

సీటీఆర్ఐ: దసరా సందర్భంగా లేపాక్షి ఎంపోరియంలో శనివారం నుంచి అక్టోబర్ ఒకటో తేదీ వరకూ డిస్కౌంట్ విక్రయాలు జరుగుతాయని మేనేజర్ జి.మోనిక తెలిపారు. ఎంపిక చేయబడిన హస్తకళలు, చేనేత వస్త్రాలపై 10 నుంచి 15 శాతం వరకూ తగ్గింపు ఇస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.విశ్వ ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం శాఖలో ఈ డిస్కౌంట్ ప్రకటించినట్టు తెలిపారు. దసరా సందర్భంగా ప్రత్యేకమైన బొమ్మల కొలువును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ఆస్తి పన్ను చెల్లింపులు జరపండి

రాజమహేంద్రవరం సిటీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26)లోని మొదటి అర్ధ సంవత్సరం ఈ నెల 30తో ముగియనున్నదని, ఈ నేపథ్యంలో ఆస్తి పన్ను చెల్లింపులు చేయాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రామలింగేశ్వర్ అన్నారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ నగరపాలక సంస్థ స్పెషల్ కౌంటర్, ఆన్‌లైన్ ద్వారా సీడీఎంఏ వెబ్ సైట్, పురమిత్ర యాప్ ద్వారా చెక్కులు, డీడీల ద్వారా చెల్లించవచ్చన్నారు. అలాగే వార్డు సచివాలయాల్లో చెక్కులు, డీడీలను కూడా అందజేయవచ్చని తెలిపారు.

వృద్ధులకు చీరల పంపిణీ



వృద్ధులకు ఆహారం, చీరలు పంపిణీ చేస్తున్న ముద్దాల అను తదితరులు

ధవళేశ్వరం: స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో శుక్రవారం వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ముద్దాల తిరుపతిరావు(అను) జన్మదినం సందర్భంగా శుక్రవారం ట్రస్ట్ కార్యాలయంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు చీరలు, ఆహారాన్ని ముద్దాల తిరుపతిరావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి యెనుమల త్యాగరాజు, ముద్దాల హనీ తదితరులు పాల్గొన్నారు.

విజయానికి సాఫ్ట్ స్కిల్స్ చాలా కీలకం



విద్యార్థులతో ప్రిన్సిపాల్ తిరుపాణ్యం తదితరులు

సీటీఆర్ఐ: విద్య, వ్యక్తిగత, వృత్తిపరమైన విజయాలలో సాఫ్ట్ స్కిల్స్ నైపుణ్యాలు కీలక పాత్ర పోషిస్తాయని డేటా ప్రో జనరల్ మేనేజర్ కె.కిశోర్ వర్మ అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ డెవలప్‌మెంట్, ఎంప్లాయిబిలిటీ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు 45 రోజుల పాటు పైథాన్ ప్రోగ్రాం ట్రైనింగ్‌ను డేటా ప్రో ప్రైవేట్ లిమిటెడ్ ఇచ్చింది. ఈ సందర్భంగా శుక్రవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో కిశోర్ వర్మ మాట్లాడుతూ బృంద పరంగా ఆలోచనలను ప్రదర్శించడంలోనూ, సమూహ చర్చలలో తమను తాము వ్యక్తపరచుకోవడంలోనూ, ఇంటర్వ్యూలను ఎదుర్కోవడంలోనూ ఇవి విలువైన పాత్ర పోషిస్తాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ తిరుపాణ్యం మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఈ నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కోర్స్ కో ఆర్డినేటర్ డాక్టర్ పీవీబీ సంజీవరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.స్వర్ణశ్రీ, డేటా ప్రో బ్రాంచ్ మేనేజర్ బి.సునీల్ కుమార్ రెడ్డి, ప్రోగ్రాం ట్రైనర్లు ఎం.భువనేశ్వరి, కె.గీత, సాయి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోయి భీమన్న జయంతి



భీమన్న చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ప్రముఖులు

కడియం: సాహిత్య దార్శనికుడు బోయి భీమన్న అని జన విజ్ఞాన వేదిక పర్యావరణ రాష్ట్ర కన్వీనర్ చిలుకూరి శ్రీనివాసరావు అన్నారు. జన విజ్ఞాన వేదిక, అరసం, చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి కళా సేవాసమితి సంయుక్తంగా శుక్రవారం కడియంలో భీమన్న జయంతి నిర్వహించాయి. తెలుగు సాహిత్యం ద్వారా సమ సమాజ స్థాపనకు భీమన్న చేసిన కృషిని వక్తలు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో తోరాటి వసంతరావు, గండి స్వామి ప్రసాద్, తమ్మిశెట్టి ప్రసాద్, ఆకుల సూర్యనారాయణ, చిక్కాల ఈశ్వరరావు పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చేవరకూ ఉద్యమం ఆగదు



రిలే దీక్ష చేపట్టిన విద్యుత్, కాంట్రాక్టు కార్మికులు

రాజమహేంద్రవరం రూరల్: విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చేవరకూ ఉద్యమాన్ని విరమించేది లేదని ట్రాన్స్‌కో జేఏసీ చైర్మన్ జగతా అచ్యుత రామయ్య స్పష్టం చేశారు. రాష్ట్ర పవర్ జేఏసీ పిలుపు మేరకు బొమ్మూరులోని 220 కేవీ సబ్ స్టేషన్ వద్ద శుక్రవారం ట్రాన్స్‌కో జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ అచ్యుత రామయ్య మాట్లాడుతూ విద్యుత్ కార్మికుల డిమాండ్లను విద్యుత్ సంస్థల యాజమాన్యం నెరవేర్చాలన్నారు. జేఏసీ కన్వీనర్ పి.రవికుమార్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏ విడుదల చేయాలని, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వడంతో పాటు సంస్థలో విలీనం చేయాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల యూనియన్ నాయకుడు డేవిడ్ రాజు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును గౌరవించి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసే దిశగా మేనేజ్‌మెంట్ అడుగులు వేయాలని డిమాండ్ చేశారు. నిరాహార దీక్షలో కూర్చున్న కార్మికులకు ఏపీఈపీడీసీఎల్ జేఏసీ చైర్మన్ వీవీఎస్ నాగేశ్వరరావు, కంపెనీ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన డిప్యూటీ సెక్రటరీ కిశోర్ సంఘీభావం తెలిపారు. ముందుగా భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి




బార్ అసోసియేషన్ వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కంబాలచెరువు: న్యాయవాదుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ (ఐఎల్ఏ) ఆధ్వర్యంలో శుక్రవారం రాజమహేంద్రవరం బార్ అసోసియేషన్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఐఎల్ఏ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు టి.పృథ్వీరాజు మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర బార్ కౌన్సిల్ విఫలమైందన్నారు. న్యాయవాదుల డెత్ బెనిఫిట్ ఫండ్‌ను రూ.10 లక్షలకు పెంచాలని, జూనియర్ న్యాయవాదులకు ఐదేళ్ల పాటు నెలకు రూ.పది వేల స్టైఫండ్ ఇవ్వాలని, న్యాయవాదులకు రూ.10 లక్షల ఆరోగ్య బీమాకార్డులు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలన్నారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అల్లంపల్లి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి పెల్లూరి రమేష్ మాట్లాడుతూ మరణించిన న్యాయవాదులకు రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంటును విడుదల చేయాలని, న్యాయవాదులపై జరుగుతున్న దాడులపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ఐఎల్ఏ రాజమహేంద్రవరం బార్ అధ్యక్షుడు కొత్తూరి ఆనంద కుమార్ మాట్లాడుతూ నోటరీ న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని, అర్హులైన వారికి ఇంటి స్థలాలు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు పరమట గణేశ్వరరావు, మర్రి బాబ్జీ, రావుల సంగమేశ్వరరావు, పి.వెంకటలక్ష్మి, సురేఖ, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్

కడియం: రిజిస్ట్రేషన్లకు సంబంధించి సాంకేతికంగా ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్త సంఘాల పిలుపు మేరకు కడియంలో దస్తావేజ లేఖర్లు శుక్రవారం పెన్‌డౌన్ చేసి తమ నిరసన తెలిపారు. ఈ మేరకు స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేసి, తమ సేవలకు దూరంగా ఉన్నారు. శనివారం కూడా ఈ నిరసన కొనసాగుతుంది. కార్యక్రమంలో గుత్తుల కృష్ణమూర్తి, వనుం శ్రీనివాస్, దంగుడుబియ్యం సూర్యనారాయణమూర్తి, యాగన రాజేశ్వరరావు, కవికొండల శ్రీనివాస్, సాయి, పోసి పాల్గొన్నారు.

మోదీ విధానాలతో ఉద్యోగులకు తీవ్ర నష్టం



నిరసన తెలుపుతున్న రైల్వే కార్మికులు

రాజమహేంద్రవరం సిటీ: ప్రధాని నరేంద్ర మోదీ నిరంకుశ పాలనతో కేంద్ర ప్రభుత్వం 8వ వేతన సంఘం నియామకంలో చేస్తున్న ఆలస్యం కారణంగా ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని ఏపీ స్టేట్ హింద్ మజ్దూర్ సభ సెక్రటరీ కె.విజయ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆల్ ఇండియా రైల్వేమెన్ ఫెడరేషన్, సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ సంయుక్తంగా ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం నగరంలో రైల్వే మోమూకార్‌లో సౌత్ సెంట్రల్ మజ్దూర్ యూనియన్ శాఖల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విజయ కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగుల ఓట్ల కోసం గత జనవరిలో హడావుడిగా 8వ వేతన సంఘాన్ని వేసేందుకు మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలిపిందన్నారు. ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుని, ఇప్పటి వరకూ కమిటీని నియమించకుండా ఆలస్యం చేస్తోందని ధ్వజమెత్తారు. పే కమిషన్ అమలు తేదీ అయిన జనవరి 2026 దగ్గర పడుతున్నప్పటికీ నోటిఫికేషన్ ఇవ్వకుండా కాలయాపన చేయడం దారుణమన్నారు. పెరిగిన ధరలు, కార్మికుల జీవన ప్రమాణాలు, ఆర్థిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటికైనా పే కమిషన్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. 8వ వేతన సంఘం కమిషన్ వేసి, గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని, లేని పక్షంలో కార్మికులు పోరాటానికి సిద్ధమవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఓపెన్ లైన్ కార్యదర్శి డి.శ్రీనివాస్ రెడ్డి, చైర్మన్ జయరాం, ఇంజినీరింగ్ – మెకానికల్ బ్రాంచ్ సెక్రటరీ జగన్నాథరావు పాల్గొన్నారు.


ఆదర్శప్రాయుడు చిలకమర్తి



చిలకమర్తి చిత్రపటానికి పూలమాల వేస్తున్న పెరుమాళ్ల రఘునాథ్

కంబాలచెరువు: తెలుగు సాహిత్యం అభివృద్ధి, వికాసానికి కళాప్రపూర్ణ చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులు చేసిన సేవలు మరువలేనవని వక్తలు అన్నారు. ఆయన జయంతి సందర్భంగా శుక్రవారం వంకాయల వారి వీధిలోని సిటీ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్లో విద్యార్థులకు వ్యాసరచన, పద్యపఠన పోటీలు నిర్వహించారు. విజేతలకు చిలకమర్తి ఫౌండేషన్ కార్యదర్శి పెరుమాళ్ల రఘునాథ్ ఆధ్వర్యంలో బహుమతి ప్రదానం చేశారు. స్కూల్ హెచ్ఎం పి.దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డైట్ విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఆర్ సుబ్రహ్మణ్యం ఆత్మీయ అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.శివదుర్గాప్రసాద్, ఎం.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



న్యాయమూర్తి సునీతకు మొక్క అందజేస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి

కంబాలచెరువు: జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీతను కలెక్టర్ కీర్తి చేకూరి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు.

అన్నసమారాధన

ధవళేశ్వరం: గ్రామంలోని కొత్తపేట వినాయకుని ఆలయం వద్ద శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ధవళేశ్వరం ఎస్సై హరిబాబు ముఖ్య అతిథిగా విచ్చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి, స్వామివారి ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు అడ్వకేట్ పురాణం శ్రీనివాస్, సావళ్ల అప్పారావు, దాసరి రామారావు, కొత్తపేట యూత్ సభ్యులు పాల్గొన్నారు.

జ్వరాలపై స్పందించిన వైద్యారోగ్యశాఖ

సాక్షి ఇంపాక్ట్

కంబాలచెరువు: రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో ప్రబలుతున్న విష జ్వరాలపై వైద్య ఆరోగ్యశాఖాధికారులు స్పందించారు. ఈ సమస్యపై 'సాక్షి' దినపత్రికలో శుక్రవారం అమ్మో విష జ్వరాలు పేరున కథనం ప్రచురితమైంది. దానికి డీఎంఅండ్‌హెచ్‌వో కె.వెంకటేశ్వరరావు స్పందించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 19 డెంగ్యూ కేసులు నమోదయ్యాయన్నారు. ఈ ఏడాది సుమారు 50 వేల గంబూషియా చేపలను నీటి నిల్వలలో వదిలామన్నారు. అవసరమైన చోట వైద్య సేవలు అందించేందుకు వైద్య సిబ్బందిని సిద్ధంగా ఉంచామన్నారు.

22, 23 తేదీల్లో నీటి సరఫరాకు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ ప్రధాన మంచినీటి సరఫరా విభాగంలో పైపులైన్‌కు మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 22వ తేదీ సాయంత్రం, 23వ తేదీ ఉదయం నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుంది. ఈ విషయాన్ని ఇన్‌చార్జి సూపరింటెండింగ్ ఇంజినీర్ రీటా శుక్రవారం తెలిపారు. దీనివల్ల రాజేంద్ర నగర్, సుబ్బారావు పేట, నెహ్రూనగర్ తదితర ప్రాంతాలకు నీటి సరఫరా ఉండదన్నారు. ముందుగా ప్రకటించిన 20వ తేదీ కాకుండా 22, 23 తేదీలలో అంతరాయం ఏర్పడుతుందని, ఈ విషయాన్ని నగర ప్రజలు గమనించాలన్నారు. ఆయా ప్రాంతాల్లో వాటర్ ట్యాంకర్ అవసరమైన వారు వాటర్ సప్లయ్ అసిస్టెంట్ ఇంజినీర్ 98499 08350ను సంప్రదించాలన్నారు.

ప్రజాప్రతినిధులతో నీతి అయోగ్ బృందం భేటీ

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జిల్లాలోని ప్రజాప్రతినిధులతో నీతి అయోగ్ కేంద్ర ప్రభుత్వ బృందం భేటీ అయ్యింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దిశ కార్యక్రమంపై డైరెక్టర్ సుందర్ ఎస్ మిశ్రా, రీసెర్చ్ అసోసియేట్ సచిన్ కాల్‌మాకర్.. ఎంపీపీలు, సర్పంచ్‌లను ఆరా తీశారు. ఈ సందర్భంగా పలువురు ఎంపీపీలు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా డ్రైనేజీ నిర్మాణానికి కేవలం రూ.లక్ష మాత్రమే కేటాయిస్తున్నారని, దీని వల్ల ప్రయోజనం ఉండడం లేదన్నారు.

మహిళల ఆరోగ్యమే కుటుంబానికి రక్ష



కార్యక్రమంలో మాట్లాడుతున్న కాతేరు పీహెచ్‌సీ వైద్యురాలు నాగదేవి

రాజమహేంద్రవరం రూరల్: మహిళల ఆరోగ్యమే కుటుంబానికి రక్ష అని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు ఏసు అన్నారు. శుక్రవారం కాతేరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో స్వస్థ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ ఈ.నాగదేవి మాట్లాడుతూ మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసం ఈ పథకం తీసుకొచ్చారని, దీనిలో భాగంగా అక్టోబర్ 2వ తేదీ వరకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు.

శ్రద్ధ వహించాలి

కడియం: ఆరోగ్యంపై మహిళలు శ్రద్ధ వహించాలని ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ అన్నారు. స్వస్థ్‌నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కడియం భాస్కర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం.మణిజ్యోత్స్న ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది 111 మందికి వివిధ రకాల పరీక్షలు జరిపారు.